# గురుదక్షిణ!

"బోరే! శ్రద్ధగా చదువు....జాగ్రత్తగా ఖర్చు చేయ్ డబ్బుని..... ఇది వుత్తరం ఏ మాత్రం కాదు. నీతి పాఠాల పట్టిక!" విసుగ్గా గది మూలకి వుత్తరాన్ని విసిరి కొట్టాడు చంద్రశేఖర్.

"తనేమన్నా చిన్న పిల్లాడా? ఇంకో రెండు, మూడేళ్ళల్లో ఇంజనీర్ కాబోతున్నాడు" సిగరెట్ వెలిగించి, పొగ బయటికి వదిలాడు.

సిగరెట్ పొగ గింగిరాలు తిరుగుతూ, గది సీలింగ్‌ని తాకుతోంది. పొగతో బాటు తిరుగుతున్న ఆలోచనలు....

...."తను జూనియర్ ఇంటర్ చదువుతుండగా, అమ్మా, నాన్నా తిరుపతి బస్ యాక్సిడెంట్‌లో మరణించారు.

అమ్మా– నాన్న పోయిన తర్వాత అన్నీ తనే అయ్యింది అక్కయ్య. డిగ్రీ పూర్తి చేసిన అక్క ఏదో 'ప్రయివేట్ ఫర్మ్‌లో' జాయినయ్యింది.

ఇంటర్ పూర్తయ్యిన తర్వాత, వైజాగ్ ఇంజనీరింగ్స్ కాలేజీలో సీటు రావటంతో తనిక్కడికి రాక తప్పలేదు. రాణి అక్కయ్య మాత్రం అక్కడే జాబ్ చేస్తుంది. ఎప్పుడో, ఏడాదికోసారి కలుసుకోవటం...." నిట్టూర్చాడు చంద్రశేఖర్. 'పాపం అక్కయ్య!' మనసులో నే జాలిపడ్డాడు క్షణకాలం.

అతనికి అప్రయత్నంగానే ఇందాక అక్కయ్య దగ్గర్నుంచి వచ్చిన వుత్తరం జ్ఞప్తికొచ్చింది.

"హల్లో చంద్రా!" గదిలోకి సుడిగాలిలా వచ్చి, పడ్డాడు స్వామి. అతనితో బాటు చంద్రశేఖర్‌కు తెలియని మరో వ్యక్తి....

"రా....రా! ఏమిటివ్వాళ కాలేజీకి ఎగనామం పెట్టేసావే?" ఆశ్చర్యపోతూనే, లోపలికి ఆహ్వానించాడు చంద్రశేఖర్.

వచ్చి, చంద్రశేఖర్ ప్రక్కనే కూర్చున్నాడు స్వామి. స్వామితో బాటు వచ్చిన వ్యక్తికేసి పరీక్షగా చూసాడు చంద్రశేఖర్.

తమ కన్నా రెండు, మూడేళ్ళు వయసులో పెద్దవాడిలా వున్నాడు.

"కాలేజీకి రాకపోవటానికి....ఇదిగో, బెజవాడ నుంచి మా కజిన్ వచ్చాడు" తనతో బాటు వచ్చిన వ్యక్తికేసి, వ్రేలితో చూపించాడు. "మీట్ మై కజిన్ మధుసూదన్! ఈయన పేరు చంద్రశేఖర్" ఒకరికొకర్ని పరిచయం చేసాడు స్వామి.

పరస్పర కరచలనాల కార్యక్రమం పూర్తయ్యింది.

"సిగరెట్టుంటే పడెయ్యరా. ప్రొద్దుట్నుంచి దమ్ముకొట్టక పోవటంతో నాలిక పీకేస్తుంది" చనువుగా అన్నాడు స్వామి.

స్వామితో బాటు, ఆ 'మధుసూదన్'కి సిగరెట్ ఆఫర్ చేసాడు చంద్రశేఖర్.

"నాకలవాటు లేదండి" బిడియపడుతూ, అన్నాడు మధుసూదన్.

ఆశ్చర్యంతో సన్నగా ఈలవేసాడు చంద్రశేఖర్. 'సిగరెట్ త్రాగని కుర్రాడు!' తన ప్రపంచపు పరిధిలో నే ఆలోచించాడతను.

"ఇక బయలుదేరుదామా అందాల ఆరాధనకి?" అడిగాడు చంద్రశేఖర్

రూమ్‌కి తాళమేసి, బయట పడ్డారు ముగ్గురు.

కొత్తగా విడుదల అయిన సినిమాల గురించి, ఆ రోజు 'క్లాస్'లో ఏం జరిగిందో 'సిరియస్'గా మాట్లాడేసుకోవటం ప్రారంభించారు చంద్రశేఖర్, స్వామి

మధుసూదన్ మాత్రం ఏం మాట్లాడక, మౌనంగా వాళ్ళని అనుసరిస్తున్నాడు.

"ఒరేయ్ చంద్రా! అటు చూడు, 'కోరమాండల్' ఎక్కడికో బయలుదేరింది" స్వామి చూపించిన వైపు చూసాడు చంద్రశేఖర్

పందొమ్మిదేళ్ళ అమ్మాయి వేగంగా నడచుకుంటూ, ఎక్కడికో వెళు తోంది.

"ఈ కోరమాండల్‌కి స్పీడు తగ్గించెయ్యాలి. ఎగిరెగిరి పడుతుందట. మొన్నటికి మొన్న ఆ సుబ్బారావ్‌ని పట్టుకొని, చెప్పు తీసి, కొట్టబోయిందట." ఉత్సాహంగా గత చరిత్ర నెమరు వేసాడు చంద్రశేఖర్.

మీరు మాట్లాడుకుంటుంది.... బహుశా ఆ అమ్మాయి గురించే అనుకుంటా. మరా 'కోరమాండల్' ఏమిటి....?" అనుమానంగా అడిగాడు మధుసూదన్.

పకపకా నవ్వేసాడు చంద్రశేఖర్.

మధుసూదన్ ముఖం చిన్నబోయింది.

అది గమనించాడు స్వామి. "అది కాదురా చంద్రా! మా మధుకి ఇవన్నీ ఏమీ తెలియదు. బుద్ధిగా తన వుద్యోగం చేసుకోవటం తప్పించి" చెప్పాడు.

మీరు కుర్రాడేనా? లేక ఆ వయసులో వున్న ముసలాడా అని అనుమానమేస్తుంది నాకు" చొరవ తసుకున్నాడు చంద్రశేఖర్. "మనమేం చేసినా, ఏ వెధవ్వేషాలేసినా ఈ వయసులో నే జరగాలి అవన్నీ. తర్వాత ఆనందాన్ని పొందే అవకాశాలు తక్కువ. అందాలతో ఆనందంగా కాలక్షేపం చెయ్యాలి తప్పించి, తర్క శాస్త్ర మూలప్రశ్నలు వేస్తే ఎట్లా?"

"అది కాదండి" చంద్రశేఖర్‌కి అడ్డుపడ్డాడు మధుసూదన్. "పాపం– వాళ్ళ దారమ్మట వాళ్ళు వెళ్ళిపోతారు కదా! ప్రత్యేకించి, ఆ అమ్మాయిల నెందుకు ఏడ్పించటం? పోనీ, మాట్లాడినా... మామూలుగా మాట్లాడవచ్చు... మళ్ళీ అందాలు... ఆనందాలు.... కాలక్షేపాలు.... ఏమిటి?"

మధుసూదన్ మాటలకి స్వామివైపు తిరిగి, కనుగీటుతూ నవ్వాడు చంద్రశేఖర్. "చూస్తుంటే గురుడుకి 'అ. ఆ.'లు ఓనమాలు కూడా తెలియనట్లుందే? ఓ వారం రోజులు మనతో బాటు తిరిగితే చాలు. ఎంత బ్రహ్మాండంగా తయారు చెయ్యాలో అంత బ్రహ్మాండంగా తీర్చి దిద్దుతాను మీ వాడ్ని."

అన్నట్లుగానే మాట నిలబెట్టుకున్నాడు చంద్రశేఖర్.

మధుసూదన్ మరో పదిహేను రోజులకి విజయవాడకి బయల్దేరే సమయానికి చంద్రశేఖర్‌కే పాఠాలు నేర్పే స్థాయికి వచ్చేసాడు. -

"మనం తప్పకుండా వుత్తర ప్రత్యుత్తరాలు, జరుపుకొందాం" చంద్రశేఖర్ చేతిని గట్టిగా నొక్కుతూ చెప్పాడు మధుసూదన్ – బయలుదేరబోయేముందు.

* * * *

చంద్రా!

ఉభయకుశలోపరి.

నిన్న 'రాజ్'లో పిక్చర్ చూడటాని కెళ్ళినపుడు, ఓ అందమైన అమ్మాయి వచ్చింది. ఆమె పాపం టికెట్ దొరక్క అవస్థపడుతుంటే, మా దగ్గర ఎగస్ట్రాగా నున్న టికెట్ యిచ్చేసాము. అందమైన ఆడపిల్లంటే 'ఆమే' అన్పించింది. చూస్తుంటే, మతిపోయిందనుకో! మళ్ళీ ఆ అందం ఎక్కడ, ఎప్పుడు కన్పిస్తుందో ఏమిటో? ఆ 'బ్యూటీ' నాకు దక్కడానికి ఏదైనా ఐడియా చెప్పు బాసూ!

మర్చిపోవద్దు సుమా!


. మధు".

మధు వుత్తరం చదివి, చిన్నగా నవ్వుకొన్నాడు చంద్రశేఖర్. "అప్పుడే తను నేర్చుకున్నవి ఆచరణలోకి తీసుకొస్తున్నాడు మాట.

వెంటనే జవాబు వ్రాసేసాడు.

"ప్రియమైన మధూ!

నీ బాధ అర్థమైంది. విజయవాడ లాంటి మహానగరంలో "అందం" చిరునామా సంపాదించటం చాలా కష్టం కావచ్చు. అయినా మనసుంటే మార్గం దొరక్కపోదుగా! ఆమె చుట్టూ రోజూ తిరుగు, వెంబడించు ఏదో ఒకరోజు నిన్ను



# "విపంచి"



గుర్తిస్తుంది. నీకు తన మనసులో ఓ గుర్తింపు యిస్తుంది. నేను నేర్పిన "ప్రేమ పాఠాలు" నీకు బాగా గుర్తున్నాయిగా!?

నువ్వు లేకపోతే చచ్చిపోతానని. ప్రేమించకపోతే నాలాంటి ప్రేమికులకు "కృష్ణానది' వుందని .- కాస్త "మషాలా" డైలాగ్స్ జల్లు. నిన్ను ప్రేమించకపోతే నన్నడుగు

విష్ యూ ఆల్ ది బెస్ట్

– చంద్రశేఖర్

* * *

క్రమం తప్పకుండా, రెండు రోజులకోసారి తన ప్రేమ ప్రోగ్రెస్ గురించి, ఉత్తరాలు వ్రాయసాగాడు మధుసూధన్.

తనా రోజు సినిమాలో చూసిన అందం పేరు "సుధ" అని, ఆమెదో జాబ్ చేస్తుందని, తనంటే పడి చస్తుందని వ్రాసాడు.

* * * *

"విశాఖ".

మధూ!

నా శుభాకాంక్షలు. ఎందుకో తెలుసా?! నక్క తోక తొక్కావు.నీ కలల రాణి 'సుధ' లైన్లో పడ్డందుకు సంతోషిస్తున్నాను. గో ఎహెడ్

మరో మాట! ప్రేమిస్తే ప్రేమించావు గాని, పెళ్ళి తలంపు మనసులోకి రానివ్వకు. ప్రేయసిని పెళ్ళి చేసుకుంటే, మనకొచ్చే కష్టం నష్టం.

మరొక సంగతి, నీ స్వదస్తూరీతో వ్రాసిన ఉత్తరాలేవీ ఆమె దగ్గర వుంచవద్దు, నీ వస్తువులు కూడా. ఆమెతో సుఖాల సాగరాన్ని యీదిన తర్వాత విడచిపెట్టెయ్యి. నీ అసలు చిరునామా ఆమెకి ఇవ్వకు సుమా!

అనుభవం మీద చెబుతున్నాను. అందాన్ని అనుభవించాలి తప్ప, ఆరాధించకూడదు."

నా సలహాలన్నీ తప్పక పాటిస్తావు కదూ!

– చంద్రశేఖర్.

పి యస్ :–" నీ సుధ ఫోటో ఒకటి పంపించు"

* * * *

"డియర్ చంద్రా!

అలా ఆడపిల్లల్ని మోసం చెయ్యడం పాపం అనుకున్నాను మొట్టమొదట్లో. కాని నీ వుపదేశంతో నా మనసు మార్చేసు కున్నాను. సుధ, నేను నాగార్జునసాగర్‌కి టూర్ ప్రోగ్రామ్ వేసుకున్నాము. అక్కడ నాకు కావల్సింది', నేను 'కోరేది' నా స్వంతం చేసుకుంటాను. మా యాత్ర 'విజయవంతమైన' మరుక్షణం సుధకి మంగళగీతం పాడేస్తాను.

ఇంతటి అద్భుతమైన సలహాలు చెప్పి, నా జీవితంలో 'థ్రిల్'ని, ఆనందాన్ని కలిగిస్తున్న ఓ మిత్రమా? నీకు నేనేమివ్వగలను గురుదక్షిణ? వీలైతే ఒకసారి విజయవాడ రా! సమర్పించుకుంటాను దక్షిణ.

సమాధానం పూర్తిగా యివ్వు.

మెనీమెనీ థేంక్స్ ఫర్ యువర్ బ్రిలియంట్ ఐడియాస్.

నీ శిష్యుడు.
మధు"

"పోస్ట్!" పోస్ట్‌మేన్ రెండు కవర్లు పడేసి, వెళ్ళిపోయాడు.

చంద్రశేఖర్ యధాలాపంగా ఆ ఉత్తరాలు చూసాడు. ఒకటి మధు దగ్గర్నుండి, మరొకటి రాణక్కయ్య దగ్గరనుండి.

ముందుగా మధు 'కవర్'ని చింపాడు. లోపల

## జెనిటిక్ లోపాల చికిత్సలో గొప్ప ముందంజ

జీవోత్పత్తి శాస్త్ర వ్యాధుల (జెనిటిక్) చికిత్సలో యిటీవల జపాన్ బ్రహ్మాండమైన ప్రగతిని సాధించింది. ఒసాకా విశ్వవిద్యాలయంలోని వైద్య పరిశోధకుల బృందం, ఎలుక జీవకణంలో మానవ-జీన్స్‌ను పెంపొందించడంలో విజయం సాధించారు. మానవ జీన్‌లను మరొక ప్రాణిలో అమర్చి పెంపొందించడంలో యీ బృందం మొట్టమొదటి సారిగా విజయం సాధించింది.

జీన్ స్ప్లైసింగ్ ప్రక్రియ సాయంతో కొలోన్ బాసిల్లిని ఉపయోగించి ఈ బృందం జీన్ లను భారీ పరిమాణంలో ఉత్పత్తి చేసింది. వాటిని జీవోత్పత్తి జరిగిన 500 అండాలలోకి ఇంజెక్టు చేసి ఎలుక అండాశయాలలోకి చేర్చారు. పుట్టిన ఎలుక పిల్లలలో యీ జీన్‌లు చక్కగా యిమిడిపోయాయని తేలింది.

ఈ విజయం జీవోత్పత్తి సంబంధమైన వ్యాధుల చికిత్సకు బాగా సాయపడగలదు.

(జ. వా)

## "గురుదక్షిణ!"

ఉత్తరంతో బాటుగా వున్న ఫోటో జారి, క్రింద పడింది. క్రిందపడ్డ ఆ ఫోటోని తీస్తూ, యధాలాపంగా దానికేసి చూసిన చంద్రశేఖర్ నిశ్చేష్టుడైపోయాడు.

వెయ్యి బాంబర్ విమానాలు ఒక్కసారిగా చుట్టుముట్టినట్టు.... చెవుల్లో హోరు.... జలపాతాల తాకిడిని భరించలేకపోతున్న ఎదపోరు.... అగ్ని పర్వతం బ్రద్దలై, కన్నీటి 'లావా'ని వెదజల్లింది.

ఆ ఫోటో.... అదే నవ్వు.... నిష్కల్మషమైన చిరునవ్వు....

అమ్మా, నాన్నా పోయినపుడు ఏడుస్తున్న తనని ఓదారుస్తూ, నవ్విన నవ్వు....

తన మీద, తన రేపటి భవిష్యత్ మీద ఆమె పెట్టుకున్న అందమైన ఆశల తాలూకు మెరుపు ఆ నవ్వులో తొణికిసలాడుతుంది.

'అక్కయ్య ఫోటో మరి మధు కవర్‌లోకి....' ఆతృతతో మధుసూదన్ ఉత్తరం చదవసాగాడు చంద్రశేఖర్.చదువుతుంటే,అతని పెదవులు అదురుతున్నాయి.

"శేఖర్!

మా ఎన్. సాగర్ 'ప్రేమ యాత్ర' విజయవంతం. ఆడదాని పొందులో యింత ఆనందముందని నాకిప్పుడే తెలిసింది. ఆపై సుధకి 'వీడ్కోలు'-చెప్పేసాను. మొన్న కన్పించి, కన్నీళ్ళు పెట్టుకొంది. నిజం చెప్పొద్దూ, నామనసు కరిగిపోయింది. కాని నీవు పదేశం ప్రకారం 'చీ' కొట్టేసాను. ఆఫ్టరాల్ ఒ ఆడది...."

ఇక ఆపై ఆ లేఖను చదవలేక పోయాడు చంద్రశేఖర్. వణుకుతున్న చేతులతో అక్కయ్య ఉత్తరాన్ని తీసి, చదవసాగాడు

"తమ్ముడు శేఖర్‌కి–

నీకిలా ఉత్తరం వ్రాయవలసి వస్తుందని నేనెన్నడూ ఊహించలేదు. కాని వ్రాయాల్సి వచ్చింది. నిన్ను ఇంజనీర్ని చెయ్యాలని, మనసుకు నచ్చిన వ్యక్తికి భార్యనై హాయిగా జీవించాలని.... ఎన్నో కలలు గన్నానురా?'

నాకలలన్నింటిని కాల్చేసాడొక దుర్మార్గుడు. నన్ను ప్రేమిస్తున్నట్లు నావెనక పడ్డాడు.అది నిజమేనని నమ్మాను. కాని ఆఫ్టరాల్.......

తమ్ముడూ! జీవితంలో తొలిసారిగా మోసగింపబడ్డాను. ఆవేధవతో కలిసి, నాగార్జునసాగర్ వెళ్ళాను. అక్కడ నాశీలాన్ని హరించి, ఆ తర్వాత చిత్రంగా అంతర్ధానమైపోయాడు.

అతడిచ్చింది రాంగ్ ఎడ్రస్!

మొన్న సాయంత్రం నాకు కన్పించాడా ఎమ్మెస్‌రావు. పలకరించబోతే, చీదరించుకున్నాడు. పైగా నేనే నిన్ను అనుభవించానననడానికి సాక్ష్యాలేవన్నా వున్నాయా అని ఎదురు ప్రశ్నించాడా మధుసూదనరావ్.

నా దగ్గర అతనిదంటూ ఏమీ లేదు. ఇంతటి మోసాన్ని నేను భరించ లేక పోతున్నాను. జీవితంలో తొలిసారిగా, తుదిసారిగా మోసగింపబడ్డ నాకిక బ్రతకడానికి అర్హత లేదు. అందుకే ఆత్మహత్య చేసుకొంటున్నాను. ఇది నా ఆఖరి ఉత్తరం.

నన్ను మన్నిస్తావు కదూ!

నీకేమీ చెయ్యలేకపోతున్న
నీ అక్క
సుధారాణి"

తను చదివిన దానిని నమ్మలేక, అలాగే కాసేపు నిలబడిపోయాడు చంద్రశేఖర్.

ఆ తర్వాత ఆ రెండు ఉత్తరాల్ని మార్చి మార్చి చూసాడు.

"గురుదక్షిణ...." విరగబడి, నవ్వాలనిపించింది చంద్రశేఖర్‌కి. గొంతులోని వెక్కిళ్ళు ఆ ప్రయత్నానికి అడ్డుపడ్డాయి.

అక్కయ్య ఫోటోని అపురూపంగా చేతిలోకి తీసుకున్నాడు.

'మధుసూధనరావ్‌కి ప్రేమతో – సుధారాణి' ఒక కన్నీటి బొట్టు 'టప్'మని రాలి, ఆ అక్షరాల్ని చెరిపేసింది.

"అక్కయ్యా....!" అరిచాడు చంద్రశేఖర్.

అతడ్ని వెక్కిరిస్తున్నట్లుగా గదిగోడ ప్రతిధ్వనించింది. □